క్లుప్తంగా

కేఆర్‌ఆర్ కళాశాలలో అందుబాటులో పీజీ సీట్లు

కోదాడ : పట్టణంలోని కేఆర్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలలో ఎంఏ తెలుగు, ఎంఏ రాజనీతిశాస్త్రంలో మేనేజ్‌మెంట్ సీట్లు అందుబాటులో ఉన్నాయని కళాశాల ప్రిన్సిపాల్ చందా అప్పారావు శనివారం ఒక ప్రకటనలో కోరారు. అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. పూర్తి వివరాలకు కోసం 95022 59063, 99492 94957 నంబర్లను సంప్రదించాలని ఆయన కోరారు.

సమాజ్ వాది పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా ప్రభాకర్



గరిడేపల్లి : సమాజ్‌వాది పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా గరిడేపల్లి మండలంలోని పొనుగోడు గ్రామానికి చెందిన నందిపాటి ప్రభాకర్ నియమితులయ్యారు. ఈమేరకు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు సింహాద్రి ప్రకటించినట్లు ఆయన శనివారం స్థానిక విలేకరుల సమావేశంలో ఆయన తెలిపారు. పార్టీ అభివృద్ధికి కృషి చేస్తాన్నారు.

పేద కుటుంబానికి ఆర్థికసాయం అందజేత



ఆర్థికసాయం అందజేస్తున్న యూత్ సభ్యులు

మోతె : మండలంలోని రావిపహాడ్ గ్రామంలో నిరుపేద కుటుంబానికి చెందిన పాడపంగి యల్లమ్మ ఇటీవల మృతి చెందింది. దీంతో బాధిత కుటుంబానికి శనివారం ఏబీఆర్ చైతన్య యూత్ సభ్యుల ఆధ్వర్యంలో రూ.22,300 ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో యూత్ సభ్యులు పాల్గొన్నారు.

ఢిల్లీలో సతీష్ డప్పు కళాబృందం ప్రదర్శన

గరిడేపల్లి: ఢిల్లీలో కేంద్ర సంగీత నాటక అకాడమీ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన ఉస్తాద్ బిస్మిల్లాఖాన్ యువ పురస్కారం వేడుకల్లో గరిడేపల్లి మండలం అప్పన్నపేట గ్రామానికి చెందిన సతీష్ డప్పు కళాబృందం అద్భుతమైన ప్రదర్శన చేశారు. ఈ ప్రోగ్రాంలో డప్పు కళాకారులు అపర్ణ, రేణుక, ధనమ్మ, వీరబాబు, గంగ, శోభన్, మల్లి తదితరులు పాల్గొన్నారు.

ఇంటాక్ట్ క్విజ్‌లో రాష్ట్ర స్థాయికి తేజ విద్యార్థులు

కోదాడ : కోదాడలోని కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం ఉమ్మడి జిల్లా స్థాయిలో నిర్వహించిన ఇంటాక్ట్ హెరిటేజ్ క్విజ్‌లో కోదాడలోని తేజ విద్యాలయానికి చెందిన విద్యార్థులు ప్రతిభ చూపి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. 75 జట్లు పాల్గొన్న ఈ పోటీల్లో తేజ విద్యాలయం విద్యార్థులు సృజన్‌గుప్తా, నితీష్‌రాజ్ ప్రథమ స్థానంలో నిలిచినట్లు తెలిపారు. వీరు నవంబర్ 27న హైదరాబాద్‌లోని సాలార్‌జంగ్ మ్యూజియంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు పేర్కొన్నారు. విజేతలకు నిర్వాహకులు సోమిరెడ్డి, నీలా సత్యనారాయణ బహుమతులు అందజేశారు.


ఘనంగా స్వపరిపాలన దినోత్సవం



వేడుకల్లో పాల్గొన్న తెల్లబల్లి ప్రాథమిక పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు

నడిగూడెం : మండలంలోని తెల్లబల్లి ప్రాథమిక పాఠశాల-1తో పాటు, సిరిపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు డి.ఉపేందర్, జి.పద్మావతి, ఉపాధ్యాయులు స్వరూప, సీఆర్‌పీ నందిగామ రామారావు, ఝాన్సీ, విద్యార్థులు పాల్గొన్నారు.

డ్రెయినేజీ లేక రోడ్లపైకి మురుగునీరు



రామ్‌నగర్‌లో వీధుల్లో పారుతున్న మురుగు

చిలుకూరు : మండలంలోని ఆర్లెగూడెం గ్రామంలో డ్రెయినేజీలు లేక మురుగు నీరంతా వీధుల్లోనే పారుతోంది. ప్రధానంగా రామ్‌నగర్‌లో (గంగిరెడ్డుల వారి కాలనీ)లో రోడ్ల వెంటే చెత్త దర్శనమిస్తోంది. మురుగుకాలువలు తీయకపోవడంతో దోమలు వ్యాప్తి చెంది జ్వరాల బారిన పడుతున్నామని ఆ కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామ పంచాయతీ అధికారులు తక్షణమే స్పందించి పారిశుద్ధ్యం మెరుగుపరచాలని, బ్లీచింగ్ పౌడర్ చల్లాలని కోరుతున్నారు.

ఖాళీ ప్లాట్లు.. ప్రజలకు తిప్పలు

- జనావాసాల మధ్య ఖాళీ స్థలాల్లో మురుగునీరు చేరి దుర్వాసన
- ఈగలు, దోమల వ్యాప్తి
- పట్టించుకోని అధికారులు





శ్రీమన్నారాయణ కాలనీలో ఖాళీ ప్లాట్లలో పెరిగిన చెట్లు

కోదాడరూరల్ : కోదాడ పట్టణంలో జనావాసాల మధ్య ఉన్న ఖాళీ ప్లాట్లు పరిసరాల పరిశుభ్రతకు ఆటంకంగా మారుతున్నాయి. ఖాళీ స్థలాల్లో మురుగు నీరు చేసి దుర్వాసన వెదజల్లుతున్నాయి. పిచ్చి మొక్కలు పెరిగి దోమలు, ఈగలు, పందులకు ఆవాసాలుగా మారాయి. దీంతో పరిసర ప్రాంత ప్రజలు ఈగలు, దోమలతో వ్యాధులకు గురవుతున్నారు. అయినా మున్సిపల్ అధికారులు ఆయా ప్లాట్ల యజమానులపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని పట్టణ ప్రజలు విమర్శిస్తున్నారు.

దోమలకు స్థావరాలుగా..

కాగా, పట్టణంలోని శ్రీమన్నారాయణ కాలనీ, నయానగర్, భవానీనగర్, టీచర్స్ కాలనీ, గణేష్‌నగర్, శ్రీనివాసనగర్, కట్టకమ్ముగూడెం రోడ్డు, గోపిరెడ్డి, గాంధీనగర్ వంటి ప్రాంతాల్లో ఇళ్ల మధ్యలో ఖాళీ స్థలాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. అనేక ఏళ్ల క్రితం ప్లాట్లను కొనుగోలు చేసిన యాజమానులు వాటి నిర్వహణను మరిచిపోయారు. ప్లాట్ల పక్కన కట్టిన ఇళ్లు ఎత్తుగా ఉండటం అవి లోతట్టులో ఉండడంతో మురుగు నీరు అందులోకి చేరుతోంది. దీంతో పిచ్చి మొక్కలు, కంపచెట్లు పెరిగి దోమలతో నానా అవస్థలు పడుతున్నామని పట్టణ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలంలో సమస్య తీవ్రంగా ఉంటుందని అంటున్నారు. ఖాళీ స్థలాల్లో ఉండే విషసర్పాలు, కీటకాలు ఇళ్లలోకి వస్తున్నాయని ఆందోళన చెందుతున్నారు. పట్టణ శివారు ప్రాంతాల్లో ఉన్న ఖాళీ స్థలాలను శుభ్రం చేయించకపోవడంతోనే సమస్య ఎక్కువగా ఉందని చెబుతున్నారు. ప్లాట్ల యజమానులకు మున్సిపల్ అధికారులు నోటీసులు ఇచ్చి వాటిని శుభ్రం చేసేవిధంగా చర్యలు తీసుకోవాలని పట్టణవాసులు కోరుతున్నారు.

ఫాగింగ్ మిషన్‌లెక్కడా..

పట్టణంలోని వార్డుల్లో దోమల నివారణకు మున్సిపల్ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దోమల నివారణకు లక్షల రూపాయల ఖర్చు చేసి కొనుగోలు చేసిన ఫాగింగ్ మిషన్లు ఎటుపోయాయని పట్టణవాసులు ప్రశ్నిస్తున్నారు. పట్టణంలో ఏ ప్రాంతంలో చూసిన ప్రజలు దోమలతో యుద్ధం చేయాల్సిన పరిస్థితి నెలకొందని వాపోతున్నారు.

పిచ్చిమొక్కలు తొలగించాలి



కోదాడ పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఏళ్లతరబడి ప్లాట్లు ఖాళీగా ఉండటంతో వాటిలో చెట్లు విపరీతంగా పెరిగి అవి దోమలు, పందులకు స్థావరంగా మారా యి. ఆ ప్లాట్ల యజమానులకు అధికారులు నోటీసులు జారీ చేసి వాటిని ప్రతి ఏడాది శుభ్రం చేసేలా చర్యలు తీసుకోవాలి. ప్రజలు దోమల బెడద లేకుండా చూడాలి.

– పిల్లుట్ల వెంకట్, శ్రీమన్నారాయణ కాలనీ, కోదాడ

ఫాగింగ్ చేయిస్తాం

పట్టణంలో దోమల నివారణకు గత నెలలో ఫాగింగ్ చేయించాం. మళ్లీ ఈ నెలలో కూడా ఫాగింగ్ చేయిస్తాం. ఖాళీ ప్లాట్లలో పెరిగిన పిచ్చిచెట్లను తొలగించే విధంగా యజమానులతో మాట్లాడి తగు చర్యలు తీసుకుంటాం.

– యాదగిరి, శానిటరీ ఇన్‌స్పెక్టర్, కోదాడ మున్సిపాలిటీ

వసతి గృహం సిబ్బందిపై తహసీల్దార్ ఆగ్రహం



బీసీ బాలికల వసతి గృహంలో భోజనం పరిశీలిస్తున్న తహసీల్దార్ సరిత

నడిగూడెం : మండల కేంద్రంలోని బాలికల వసతి గృహాన్ని శనివారం రాత్రి తహసీల్దార్ వి.సరిత ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆ సమయంలో సంబంధిత వార్డెన్ లేరు. మొత్తం 112 మంది విద్యార్థులకు గాను 78 మంది మాత్రమే ఉన్నారు. భోజనం, కూరలు తనిఖీ చేసి చాలీచాలని భోజనం ఏర్పాటు చేయడంతో ఆమె సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పలు గదుల్లో విద్యుత్ దీపాలు లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నట్లు గుర్తించారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని విద్యార్థులకు హామీ ఇచ్చారు. ఆమె వెంట ఆర్‌ఐ గోపాలకృష్ణ ఉన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

నడిగూడెం : మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని తహసీల్దార్ వి.సరిత, ఎంపీడీఓ ఎస్‌డి.ఇమామ్, మండల విద్యాధికారి బి.ఉపేందర్‌రావు కోరారు. శనివారం మండల కేంద్రంలోని బాలికల వసతి గృహం, బాలికల పాఠశాల, సిరిపురం ప్రాథమిక పాఠశాల, ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఐ కె.గోపాలకృష్ణ, ప్రధ్యానోపాధ్యాయులు, మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులు ఉన్నారు.

సీపీఐని బలోపేతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

నేరేడుచర్ల: సీపీఐని బలోపేతం చేసేందుకు కార్యకర్తలు కృషి చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం నేరేడుచర్లలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సీపీఐ మండల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీపీఐ శతాబ్ది ఉత్సవాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఈ నెల 26 నుంచి డిసెంబర్ 26 వరకు ప్రజా సంఘాల సభ్యత్వ నమోదు చేపట్టాలన్నారు. సీపీఐ నేత ఉదర వెంకన్న అధ్యక్షతన జరిగిన సమావేశంలో నాయకులు ధనుంజయనాయుడు, మండవ వెంకటేశ్వర్లు, కత్తి శ్రీనివాస్‌రెడ్డి, రావుల సత్యం, కొమ్మరాజు వెంకట్, పరికే భరత్ తదితరులు పాల్గొన్నారు.

సనాతన ధర్మాన్ని రక్షించుకోవాలి



నేరేడుచర్లలో రథయాత్రలో మాట్లాడుతున్న శ్రీనివాస్

నేరేడుచర్ల : సనాతన ధర్మానికి ఆటంకం కలిగించే వారి పట్ల అప్రమత్తంగా ఉండాలని ధర్మ జాగరణ సమితి తెలంగాణ ప్రాంత ఉపాధ్యక్షుడు శ్రీరామచంద్రుని శ్రీనివాస్ అన్నారు. శనివారం నేరేడుచర్ల మండల కేంద్రంతో పాటు బక్కయ్యగూడెం, మేడారం, పత్తేపురంలో ధర్మ జాగరణ సమితి తెలంగాణ ఆధ్వర్యంలో నిర్వహించిన హిందూ ప్రచార రథయాత్రలో ఆయన పాల్గొని మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో ధర్మ రక్ష సమితులను ఏర్పాటు చేసి భజన మండలి సత్సంగాలు, సామూహిక పండుగలు జరుపుకొని సనాతన ధర్మాన్ని రక్షించుకోవాలన్నారు. కార్యక్రమంలో నరేందర్, నటరాజ్, వీరయ్య, లక్ష్మయ్య, అయ్యప్ప, శేఖర్, శ్రీనివాస్, నాగిరెడ్డి, పుల్లయ్య, మోహన్, శంకర్‌రెడ్డి, శ్రీనివాస్, కోటేశ్వర్‌రావు, వెంకటేశ్వర్లు, సత్యనారాయణరెడ్డి, సుబ్రహ్మణ్యం, వాసు, చారి తదితరులు ఉన్నారు.

ఇంటింటికీ ప్రభుత్వ పథకాలు

హుజూర్‌నగర్‌రూరల్ : ప్రతి ఇంటికి పథకాలు అందేలా ప్రభుత్వం చర్యలు చేపడుతుందని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ లావణ్య అన్నారు. శనివారం హుజూర్‌నగర్ మండల కేంద్రంతో పాటు బూరుగడ్డ, గోపాలపురం గ్రామాల్లో ప్రభుత్వ పథకాలపై నిర్వహించిన కళాజాతాను ఆమె ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వం గిరిజనుల ఉపాధికి శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ గూడెపు శ్రీనివాస్, కార్యదర్శులు ఇందిరా, గిరిజాకుమారి, తెలంగాణ సాంస్కృతిక సారధి టీమ్ లీడర్ వేముల శ్రవణ్‌కుమార్, కళాకారులు నాగలక్ష్మి, ప్రియాంక, స్రవంతి, ప్రియదర్శిని, ఇందిరా, మౌనిక తదితరులు పాల్గొన్నారు.

29 నుంచి సీపీఎం జిల్లా మహాసభలు



హుజూర్‌నగర్ : రైస్ మిల్లు కూలీల సమావేశంలో మాట్లాడుతున్న శీలం శ్రీను

హుజూర్‌నగర్ : సూర్యాపేటలో నవంబర్ 29 నుంచి డిసెంబర్ 1వ తేదీ వరకు నిర్వహించబోయే సీపీఎం జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శీలం శ్రీను కోరారు. శనివారం హుజూర్‌నగర్ పట్టణంలోని సీఐటీయూ కార్యాలయం వద్ద నిర్వహించిన రైస్ మిల్లు దినసరి కూలీల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు తిరపయ్య, వెంకటమ్మ, గోపమ్మ, మంగ, చంద్రకళ, సైదమ్మ, మహాలక్ష్మి, పద్మ, రమణ, పిచ్చమ్మ, సీతమ్మ, అంజమ్మ, తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం సభను జయప్రదం చేయాలి

నేరేడుచర్ల : సూర్యాపేటలో ఈనెల 29వ తేదీన జరిగే సీపీఎం బహిరంగ సభను జయప్రదం చేయాలని పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు పారేపల్లి శేఖర్‌రావు కోరారు. శనివారం నేరేడుచర్లలోని హరిబండి భవన్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో పార్టీ పట్టణ కార్యదర్శి కొదమగుండ్ల నగేష్, కుంకు తిరుపతయ్య, నీలా రామ్మూర్తి, రుద్రమ్మ, కృష్ణవేణి, శ్రీనివాస్‌రావు, వెంకటయ్య, యేసు ఉన్నారు.

సీపీఎం మహాసభల కరపత్రం ఆవిష్కరణ

హుజూర్‌నగర్‌రూరల్ : సూర్యాపేట జిల్లా కేంద్రంలోని గాంధీపార్క్‌లో ఈ నెల 29న నిర్వహించబోయే సీపీఎం జిల్లా తృతీయ మహాసభలను జయప్రదం చేయాలని ఆ పార్టీ మండల కార్యదర్శి పోషబోయిన హుస్సేన్ కోరారు. శనివారం హుజూర్‌నగర్ మండలంలోని గోపాలపురంలో మహాసభల కరపత్రం ఆవిష్కరించారు. అనంతరం ఇంటింటి ప్రచారం నిర్వహించి మాట్లాడారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు చందాల భిక్షం, సిద్దెల వెంకటయ్య, చీకూరి తిరుపతయ్య, మాధవరావు, నాగేంద్రమ్మ, సర్వయ్య, తదితరులు పాల్గొన్నారు.

గరిడేపల్లిలో..

గరిడేపల్లి : సూర్యాపేటలో ఈ నెల 29, 30, డిసెంబర్ 1న నిర్వహించబోయే సీపీఎం జిల్లా మూడవ మహాసభలను విజయవంతం చేయాలని పార్టీ మండల కార్యదర్శి ఎస్‌కే యాకూబ్ కోరారు. శనివారం మండల కేంద్రంతో పాటు అప్పన్నపేట గ్రామాల్లో మహాసభల కరపత్రం ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో ఎస్‌కే నాగుల్, బావలి హలీం, సురేష్, వెంకటేశ్వర్లు, కమలమ్మ, రాములమ్మ, సైదమ్మ, రమణ తదితరులు పాల్గొన్నారు.

మట్టపల్లిలో నిత్యకల్యాణం

మఠంపల్లి: మట్టపల్లి క్షేత్రంలో శనివారం శ్రీరాజ్యలక్ష్మి చెంచులక్ష్మి సమేత శ్రీప్రహ్లాదయోగానంద శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్యకల్యాణాన్ని అర్చకులు శాస్త్రోక్తంగ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు, హోమం జరిపారు. అనంతరం స్వామిఅమ్మవార్లను నూతన పట్టు వస్త్రాలతో వధూవరులుగా అలంకరించి ఎదుర్కోలు మహోత్సవం చేపట్టారు. ఆ తర్వాత కల్యాణ తంతు నిర్వహించారు. ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు విజయ్‌కుమార్, మట్టపల్లిరావు, ఈఓ నవీన్‌కుమార్, అర్చకులు రామాచార్యులు, పద్మనాభాచార్యులు, లక్ష్మీనరసింహమూర్తి, ఫణిభూషణ మంగాచార్యులు, ఆంజనేయాచార్యులు, భక్తులు పాల్గొన్నారు.

సరిపడా ట్యాగులు లేక ఎక్కడి ధాన్యం అక్కడే

కోదాడరూరల్ : కొనుగోలు కేంద్రాల్లో ట్యాగులతో సంబంధం లేకుండా ప్రభుత్వం రైతుల నుంచి ధాన్యం కొనాలని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బొల్లు ప్రసాద్ డిమాండ్ చేశారు. శనివారం కోదాడ పట్టణ పరిధిలోని తమ్మరలో గల ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన పరిశీలించి రైతులతో ఆయన మాట్లాడారు. సన్న ధాన్యం విక్రయించిన ప్రతి బస్తాకు ట్యాగులు వేయాలంటూ ప్రభుత్వం నిబంధనలు పెట్టడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. సరిపడ ట్యాగులు రాక కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం రాశులు ఎక్కడివి అక్కడే ఉన్నాయని తెలిపారు. ప్రభుత్వం వెంటనే సరిపడ ట్యాగులను కొనుగోలు కేంద్రాలకు పంపించి రైతుల సమస్యలను పరిష్కరించాలని కోరారు.

యాజమాన్య పద్ధతులతో దిగుబడులు



అవగాహన కల్పిస్తున్న బీఎస్సీ అగ్రికల్చర్ విద్యార్థులు, శాస్త్రవేత్తలు

గరిడేపల్లి : రైతులు పంటలో యాజమాన్య పద్ధతులు పాటిస్తే మంచి దిగుబడులు సాధించవచ్చని కేవీకే శాస్త్రవేత్త ఎ.కిరణ్ తెలిపారు. గ్రామీణ కృషి అనుభవ కార్యక్రమంలో భాగంగా హైదరాబాద్‌లోని మల్లారెడ్డి యూనివర్సిటీకి చెందిన బీఎస్సీ అగ్రికల్చర్ విద్యార్థినులు శనివారం మండలంలోని మర్రికుంట గ్రామాన్ని సందర్శించి, గ్రామీణ వ్యవసాయ విధానాలు, స్థితిగతులను తెలుసుకున్నట్లు ఆయన తెలిపారు. గ్రామ పటం, వెన్ డయాగ్రమ్ పైచార్ట్ ప్రదర్శించి గ్రామస్తులకు అవగాహన కల్పించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో రావే ఇన్‌చార్జ్ ఎ.నరేష్, కేవీకే శాస్త్రవేత్తలు కిరణ్, నరేష్, వ్యవసాయ అధికారి ప్రియతమ్‌కుమార్, రైతులు రాంబాబు, శ్రీనివాస్, ఉపేంద్ర, రామలింగ, సైదులు, వెంకన్న, వ్యవసాయ విద్యార్థినులు దీపిక, భవ్యవాని, భవ్య, అభిజ్ఞ, ఐశ్వర్య, భవాని తదితరులు పాల్గొన్నారు.

వెండి పంచ హారతి బహూకరణ

నడిగూడెం : మండల కేంద్రంలోని కోదండరామస్వామి ఆలయానికి శనివారం నడిగూడెంకు చెందిన బుస్సా మహేష్, సులోచన దంపతుల కుమార్తె దివ్యశ్రీ వెండి పంచ హారతి బహూకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ పూజారి ఎస్‌పీవి వరదాచార్యులు, ఆలయ కమిటీ సభ్యులు వందనపు సూర్యప్రకాష్‌రావు, భారతమ్మ, విజయ పాల్గొన్నారు.

నేడు సర్వబ్రాహ్మణ కార్తీక సమారాధన

కోదాడరూరల్ : పట్టణంలోని బ్రాహ్మణ భవన్‌లో ఆదివారం సర్వబ్రాహ్మణ కార్తీక సమారాధన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు కొండపల్లి సింగయ్య, తుంగతుర్తి శేషగిరిరావు, మంత్రిప్రగడ శ్రీధర్‌రావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నియోజకవర్గంలోని సర్వబ్రాహ్మణులు ఈ సమారాధనలో పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు.

సీపీఎం మండల కమిటీ సభ్యుడిగా సైదులు

మునగాల : సీపీఎం మునగాల మండల కమిటీ సభ్యుడిగా మండలంలోని కొక్కిరేణి గ్రామానికి చెందిన గ్రామ శాఖ కార్యదర్శి నందిగామ సైదులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శుక్రవారం రాత్రి గణపవరంలో నిర్వహించిన పార్టీ మండల 9వ మహాసభలో ఆయనను ఎన్నుకున్నారు. శనివారం సైదులు స్థానిక విలేకరులతో మాట్లాడారు. మండలంలో సీపీఎం బలోపేతానికి కృషి చేస్తానని అన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కోదాడరూరల్ : కోదాడ పట్టణ పరిధిలోని తమ్మర ఇండస్ట్రీయల్ ఫీడర్, గ్రామంలోని 11 కేవీ లైన్ల కింద ఉన్న చెట్లకొమ్మలను తొలగించేందుకు ఆదివారం ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు రూరల్ ఏఈ సైదా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు, రైతులు సహకరించాలని ఆయన కోరారు.

నేడు గౌడ కులస్తుల కార్తీక వనభోజనాలు

కోదాడరూరల్ : కోదాడ పట్టణ పరిధిలోని కొమరబండ శివారులో గల మామిడి తోటలో ఆదివారం జరగనున్న గౌడ కులస్తుల కార్తీక వనభోజన మహోత్సవంలో గౌడకుటుంబ సభ్యులందరూ పాల్గొనాలని కమిటీ అధ్యక్షుడు కారింగుల అంజన్ గౌడ్ కోరారు. శనివారం కమిటీ సభ్యులతో కలిసి వనభోజన మహోత్సవ స్థలాన్ని పరిశీలించి ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు పుట్టా వెంకటేష్‌గౌడ్, సంపేట రవిగౌడ్, కోసూరి భద్రిగౌడ్, బైరు భాస్కర్‌గౌడ్, కేశగాని రమేష్‌గౌడ్, రౌతు రామారావుగౌడ్, వేముల వీరబాబుగౌడ్ ఉన్నారు.

పాఠశాలలో దంత వైద్యశిబిరం

హుజూర్‌నగర్ : పట్టణంలోని ఎండీఆర్ స్కూల్‌లో శనివారం సిరి డెంటల్ ఆధ్వర్యంలో ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా దంత వైద్యురాలు మల్లేశ్వరి మాట్లాడుతూ.. ఆహారపు అలవాట్లు, బ్రష్ చేయడం, పళ్లకు హానీ కలగకుండా ఎలా జాగ్రత్తలు తీసుకోవాలో ఆమె వివరించారు. కార్యక్రమంలో ఎండీ సనా, కరెస్పాండెంట్ దామోదర్ రెడ్డి, హెచ్‌ఎం భూపాల్ రెడ్డి, నర్సిరెడ్డి, మౌనిక, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


బీజేపీ నాయకుల సంబరాలు

మోతె : మహారాష్ట్రలో అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ విజయం సాధించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ మోతె మండలంలోని రాఘవాపురం ఎక్స్ రోడ్డు గ్రామంలో శనివారం బీజేపీ శ్రేణులు సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా టపాసులు కాల్చి కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో భూక్య శంకర్, ధర్మారెడ్డి, నాగం వెంకటేశ్వర్లు, మల్సూర్‌నాయక్, పాలకూరి పవన్, ఉప్పుల రామచంద్రు, మైనంపాటి వెంకటరెడ్డి, రంగనాయక్, తదితరులు పాల్గొన్నారు.

26న 'చలో హైదరాబాద్'

మునగాల : హైదరాబాద్‌లోని ఇందిరపార్క్ ఆవరణలో ఈనెల 26న నిర్వహించబోయే చేయూత పెన్షన్‌దారుల మహాధర్నాను విజయవంతం చేయాలని వికలాంగుల హక్కుల పోరాట సమితి (వీహెచ్‌పీఎస్) జిల్లా అధికార ప్రతినిధి పేరెల్లి బాబు కోరారు. శనివారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. వీహెచ్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ ఈ మహాధర్నాలో పాల్గొననున్నట్లు తెలిపారు. వికలాంగుల హక్కుల సాధనకు నిర్వహించే ఈ మహాధర్నాలో వికలాంగులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

సైదులు మృతి పార్టీకి తీరని లోటు



సైదులు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

మునగాల : మండలంలోని తాడువాయి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు సిర్రా సైదులు మృతి పార్టీకి తీరని లోటని బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొలిశెట్టి బుచ్చిపాపయ్య, పార్టీ మండల అధ్యక్షుడు కొప్పుల జైపాల్‌రెడ్డి అన్నారు. ఇటీవల ఐకేపీ కేంద్రంలో విద్యుదాఘాతానికి గురై మృతిచెందిన సైదులు దశదినకర్మలో వారు పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎలక నరేందర్‌రెడ్డి, వేనేపల్లి వీరబాబు, కాసర్ల బోస్, దేవినేని రవి, సొంపంగు గోపి, నలబోలు సతీష్‌రెడ్డి, జిల్లేపల్లి వెంకటేశ్వర్లు, దేవరం సుధీర్‌రెడ్డి, సీపీఎం నాయకులు మాతంగి పుల్లయ్య, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించాలి

- కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్



చిలుకూరు : సర్వే డేటా ఎంట్రీ ప్రక్రియను పరిశీలిస్తున్న కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్

మునగాల : ప్రభుత్వ కేంద్రాల్లో కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు మిల్లులకు తరలించాలని కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ అన్నారు. మునగాల మండలం బరాఖత్‌గూడెం శివారులో మునగాల పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శనివారం కలెక్టర్ తనిఖీ చేశారు. ధాన్యం రాశులను పరిశీలించి రైతులతో ముచ్చటించి వారి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ కాంటాలు పూర్తయి ధాన్యం బస్తాలు కుట్టేటప్పుడు ట్యాగ్ కూడా ఉండాలని సిబ్బందిని ఆదేశించారు. ధాన్యం అమ్మిన డబ్బులతో పాటు సన్న రకానికి రూ.500 బోనస్ కూడా వెంటనే రైతుల ఖాతాల్లో జమచేస్తున్నామన్నారు. ఆయన వెంట కోదాడ ఆర్డీఓ సూర్యనారాయణ, తహసీల్దార్ వి.ఆంజనేయులు, ఏఓ బుంగా రాజు, సొసైటీ సీఈఓ బసవయ్య, ఆర్‌ఐ రామారావు, ఏఈఓ రేష్మా ఉన్నారు.

డేటా ఎంట్రీ సమర్థంగా పూర్తిచేయాలి

చిలుకూరు : సమగ్ర కుటుంబ సర్వే డేటా ఎంట్రీని సమర్థంగా పూర్తిచేయాలని కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవర్ అన్నారు. శనివారం చిలుకూరు మండల పరిధిలోని మిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో సమగ్ర కుటుంబ సర్వే డేటా ఎంట్రీని ఆయన పరిశీలించి మాట్లాడారు. తప్పులు లేకుండా సకాలంలో డేటా ఎంట్రీ చేయాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ సూర్యనారాయణ, తహసీల్దార్ ధృవకుమార్, ఎంపీడీఓ గిరిబాబు, ఎంపీఓ జగదీష్, ఆర్‌ఐ సీతయ్య, అశోక్ సూపర్‌వైజర్లు, ఎన్యుమరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

నిధుల దుర్వినియోగంపై షోకాజ్ నోటీసులు

చిలుకూరు : మండలంలోని జానకీనగర్ గ్రామ పంచాయతీ నిధులు దుర్వినియోగానికి పాల్పడిన మాజీ సర్పంచ్, మాజీ ఉప సర్పంచ్‌కు శనివారం డీపీఓ షోకాజ్ నోటీసులు జారీ చేశారు. 2013 – 2018 వరకు సర్పంచ్‌గా ఉన్న గుగులోతు నాగేశ్వరరావుకు, 2019 నుంచి 2024 వరకు సర్పంచ్‌గా ఉన్న పంతులు నాయక్ మృతి చెందడంతో ఆ సమయంలో ఉప సర్పంచ్‌గా ఉన్న భట్టు శ్యామ్‌కుమార్‌కు షోకాజ్ నోటీసులు ఇచ్చారు. నోటీసులు అందిన మూడు రోజుల్లో రాత పూర్వకంగా సంజాయిషీ ఇవ్వాలని నోటీసుల్లో పేర్కొన్నారు. కాగా, నిధుల దుర్వినియోగంపై గ్రామానికి చెందిన భట్టు అమృనాయక్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ జరిపి, నోటీసులు అందజేసినట్లు ఎంపీడీఓ గిరిబాబు, ఎంపీఓ జగదీష్ తెలిపారు. అదేవిధంగా వీరి కాలంలో పని చేసిన పంచాయతీ కార్యదర్శులు ఎస్‌వీ రామారావు(రిటైర్డ్), ఆర్.సురేందర్, జె.వెంకటేశ్వర్లు(రిటైర్డ్), ఎండీ ఆశియాసుల్తాన్, ఏ.అశోక్, పి.సురేష్, పి.లక్ష్మిప్రవళికకు కూడా షోకాజ్ నోటీసులు ఇచ్చినట్లు పేర్కొన్నారు.

వైభవంగా మహా కుంభాభిషేకం



భక్తాంజనేయస్వామి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న పూజారులు, భక్తులు

మోతె : మండలంలోని రావిపహాడ్ గ్రామంలో గల శ్రీభక్తాంజనేయస్వామి ఆలయంలో శనివారం మహా కుంభాభిషేకం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో గణపతి పూజ, అఖండ ప్రతిష్ఠ, వాస్తు హోమం చేశారు. మహోత్సవంలో భాగంగా మహిళలు స్వామివారిని జలబిందెలతో అభిషేకం చేశారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు కేసాని సత్యాంభ, కోట శేఖర్‌రెడ్డి, కొప్పుల ఇందిర, ఉప్పుల శ్రీకళ, కొండ విజయ, పొనుగోటి కల్పన, కాకి సుధారాణి, కాకి పద్మ, గ్రామ పెద్దలు, యువకులు, భక్తులు పాల్గొన్నారు.

వికలాంగుల సదస్సును జయప్రదం చేయాలి



తిమ్మారెడ్డిగూడెంలో మాట్లాడుతున్న గిద్దె రాజేష్

మునగాల : హన్మకొండలో ఈనెల 25న నిర్వహించబోయే భారత వికలాంగుల హక్కుల పోరాట సమితి (బీవీహెచ్‌పీఎస్) రాష్ట్ర సదస్సును విజయవంతం చేయాలని ఆ సమితి రాష్ట్ర అధ్యక్షుడు గిద్దె రాజేష్ పిలుపునిచ్చారు. శనివారం మండలంలోని తిమ్మారెడ్డిగూడెంలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ వికలాంగులకు ఇచ్చిన హామీల అమలు కోసం రాష్ట్ర సదస్సులో ఉద్యమ కార్యాచరణ ప్రకటించనున్నట్లు వెల్లడించారు. వికలాంగులకు రూ.ఆరువేల పెన్షన్, ఆర్టీసీలో ఉచిత బస్సు ప్రయాణం, వికలాంగుల అట్రాసిటీ చట్టం, వికలాంగుల సంక్షేమ శాఖను మహిళా శిశు సంక్షేమ శాఖ నుంచి వేరు చేసి ప్రత్యేక శాఖగా గుర్తిస్తామని రేవంత్‌రెడ్డి ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన విధంగా అమలు చేయాలని కోరారు. సమావేశంలో మునగాల మండల శాఖ అధ్యక్షుడు గోపిరెడ్డి శేఖర్‌రెడ్డి, నాయకులు ఆరూరి బాబు, అల్వాల రమేష్, గుమ్మడెల్లి ఆంజనేయులు, ధారవత్ లచ్చు, జక్కిరి నర్సమ్మ, భూతం వెంకటమ్మ, పోలదాసు భిక్షవమ్మ, శ్రీరాముల లక్ష్మయ్య, అలియమ్మ, దశరథ పాల్గొన్నారు.

ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ జన్మదిన వేడుకలు



నేరేడుచర్లలో కేక్ కట్ చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

నేరేడుచర్ల : బీఆర్‌ఎస్ రాష్ట్ర నేత ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ జన్మదిన వేడుకలను శనివారం నేరేడుచర్లలోని బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ దొండపాటి అప్పిరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు అరిబండి సురేష్‌బాబు, నాయకులు చెన్నబోయిన సైదులు, నాగండ్ల శ్రీధర్, రాపోలు నవీన్‌కుమార్, లింగయ్యయాదవ్, జయబాబు, సుదర్శన్, పిచ్చిరెడ్డి, హుస్సేన్, ఉపేందర్, రాజేష్, గురువయ్య, రామస్వామి, సతీష్, వాసు, భాస్కర్ తదితరులు ఉన్నారు.

నడిగూడెం : మండల కేంద్రంలో శనివారం బీఆర్‌ఎస్ నేత ఆర్‌ఎస్.ప్రవీణ్‌కుమార్ జన్మదిన వేడుకలను మానవ హక్కుల పరిరక్షణ వేదిక ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పందిటి క్రాంతికుమార్, బీఆర్‌ఎస్ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు దాసరి శ్రీను, నాయకులు గంటెపంగు నాగార్జున, పాతకొట్ల అశోక్, ఆకాష్, నాగారపు రోహిత్, పందిటి బన్నీ పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం